క్లుప్తంగా

పారదర్శక పాలన అందిస్తా...



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: నియోజకవర్గంలో పారదర్శక పాలన అందిస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం రూ.10లక్షలకు పెంపు పథకాన్ని ప్రారంభించారు. కూనంనేని మాట్లాడుతూ.. అన్నీ నా హయాంలోనే అయ్యాయి.. వేరేవాళ్లు ఏమీ చేయలేదనే గ్లోబల్ ప్రచారాలు నేను చేసుకోనన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో ఈ ఆస్పత్రిని ప్రారంభించడం జరిగిందన్నారు. తాను ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శిరీష, సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, కొత్వాల శ్రీనివా సరావు, సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, మచ్చా శ్రీనివాసరావు, నూకల రంగారావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ కార్యక్రమంలో కొందరు రాజకీయ పార్టీల నేతలు అత్యుత్సాహంతో వేదికపై కూర్చోవడం విమర్శలకు దారి తీసింది.

ఎమ్మెల్యేకు సన్మానం



కూనంనేనిని సన్మానిస్తున్న బ్రాహ్మణులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం రైటర్ బస్తీలోని గణేష్ టెంపుల్‌లో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం బ్రాహ్మణ వన సమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనిని బ్రాహ్మణులు ఘనంగా సన్మానించారు. జీఎం (పర్చేజ్) సుబ్బారావు, జీఎం సోలార్ జానకీరామ్, ఎస్‌యూబీ శర్మ, రమణమూర్తి, రాంప్రసాద్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై సీఐటీయూ పోరాడుతుంది



మాట్లాడుతున్న మందా నరసింహారావు

టేకులపల్లి: సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో ఈసారి కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కోయగూడెం ఓసీలో అబ్బాస్ అధ్యక్షతన జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జేబీసీసీఐ నిర్ణయాలు సింగరేణిలో అమలుకు కృషి చేశామన్నారు. మిగతా సంఘాలు వారి ప్రయోజనాలు తప్ప కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి సంఘాలకు ఓట్లు వేయవద్దన్నారు. గుర్తింపు సంఘాల పేరుతో పైరవీలు చేస్తూ డబ్బు దండుకుంటున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించే విధంగా, ఆస్పత్రులలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రేపాకుల శ్రీనివాస్, ఎస్‌ఏ నబీ, ఎండీ అబ్బాస్, కె.క్రిష్టారెడ్డి, తాళ్లూరి క్రిష్ణ గుగులోత్ చందర్, ఈసం నర్సింహారావు పాల్గొన్నారు.

కార్మికులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

టేకులపల్లి: సింగరేణి కార్మికులు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం కోయగూడెం ఓపెన్‌కాస్టులో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోయగూడెం ఓపెన్ కాస్టుని ప్రైవేట్ పరం చేస్తున్నా యూనియన్లు పట్టించుకోవడం లేదన్నారు. పెద్ద డివిజన్‌గా ఉన్న ఇల్లెందులో గనులన్నీ మూసివేశారని గుండాలలో గనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిలో కొత్త గనులు ప్రారంభించాలని, తద్వారా ఐదు వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మెడికల్ బోర్డు అవినీతికి అడ్డుకట్ట వేసి పారదర్శకంగా కార్మికులందరికీ అన్‌ఫిట్ అయ్యే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్‌ను గెలిపిస్తే కార్మికులకు అండగా ఉంటామని, చట్టాలు, హక్కులు, రక్షణ, సంక్షేమం, ప్రమోషన్లపై నిత్యం కార్మికుల పక్షాన ఉండి పోరాడుతామన్నారు.

ఆరుగాలం కష్టం.. రైతన్నలకు దుఃఖం

మిచాంగ్ తుపాన్‌తో దెబ్బతిన్న పంటలు

- సుజాతనగర్ మండలంలో అత్యధికంగా 1,610 ఎకరాల్లో పంటనష్టం
- దిగుబడి చేతికొచ్చే దశలో తుపాను ముంచిందని కర్షకుల ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



లక్ష్మీదేవిపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు (ఫైల్)

సుజాతనగర్: మిచాంగ్ తుపాను ప్రభావంతో కొత్తగూడెం నియోజకవర్గంలో వివిధ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో రైతులు సాగు చేసిన వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. వర్షానికి ఈదురుగాలులు తోడు కావడంతో ఆయా పంటలు నేలవాలాయి. పంటలు చేతికి వచ్చే సమయంలో వర్షానికి పత్తి, మిరప రంగు మారి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా మిరపతోటల్లో నీరు నిలవడంతో వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు కుళ్లిపోతాయని వాపోతున్నారు. కోసి కల్లాల్లో, రోడ్ల మీద ఆరబోసిన వరి ధాన్యం రాసులు తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వానాకాలం వరి కోతలు సగం మాత్రమే పూర్తయ్యాయి. చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట నేల వాలింది. వరి కంకులను కట్టలు కట్టి నిలబెట్టేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

కారిపోతున్న పత్తి..

పంట దిగుబడి చేతికొచ్చే సమయంలోనే ప్రకృతి కన్నెర్ర చేయడంతో పంటలను కాపాడుకోలేక కర్షకులు ఆగమాగం అవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలోనే వర్షార్పణం కావడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి నియోజకవర్గ వ్యాప్తంగా పత్తి పంట కూడా బాగా దెబ్బతింది. చేలల్లోని పత్తి తడిసి నల్లబడి నేల రాలిపోతుంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

4,700 ఎకరాల్లో నష్టం...

ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తగూడెంలో వరి, పత్తి, మిరప పంటలు 85 ఎకరాలు, సుజాతనగర్‌లో అత్యధికంగా 1,610 ఎకరాలు, చుంచుపల్లిలో 787 ఎకరాలు, లక్ష్మీదేవిపల్లిలో 1,175 ఎకరాలు, పాల్వంచలో 1032 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తుపాను, ఈదురు గాలులకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో దాదాపు 4,700 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నష్టపోయిన పంటలను పరిశీలించి పరిహారం చెల్లించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో పంట నష్టం వివరాలు

మండలం	నష్టం(ఎకరాల్లో)	రైతుల సంఖ్య
కొత్తగూడెం	85	41
సుజాతనగర్	1,610	1,192
చుంచుపల్లి	787	366
లక్ష్మీదేవిపల్లి	1,175	610
పాల్వంచ	1,032	556
మొత్తం	4,689	2,765



నీట మునిగిన వరిని చూపిస్తున్న రైతు (ఫైల్)

ప్రభుత్వం ఆదుకోవాలి...



రెండెకరాల సొంత పొలంతో పాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. వర్షం మూలంగా వరి పంట మొత్తం నేలవాలిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– బానోతు సబ్రీ, రైతు, సుజాతనగర్

పరిహారం చెల్లించాలి...



రెండెకరాల్లో వరి పంట సాగు చేశాను. వర్షం, ఈదురు గాలుల మూలంగా పంట వేళ్లతో సహా నేలకొరిగింది. అధికారులు సమగ్రంగా సర్వే చేసి పంట నష్టపరిహారం అందజేయాలి. కొత్తగా వచ్చిన ప్రభుత్వ రైతులను ఆదుకోవాలి.

– కొరదల వెంకటేశ్వర్లు, రైతు, సుజాతనగర్

నివేదిక అందజేశాం...



మండల వ్యాప్తంగా పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం. పరిహారం విషయంలో ఇంకా ప్రభుత్వం నుంచి ఎటువంటి గైడ్‌లైన్స్ రాలేదు. ఏయే పంటలకు ఎంత నష్టం జరిగిందో నివేదికలు తయారు చేశాం.

– గాండ్ల నర్మద, వ్యవసాయాధికారిణి

మంత్రులకు ఘనస్వాగతం



జూలూరుపాడు: అభివాదం చేస్తున్న మంత్రులు పొంగులేటి, తుమ్మల



కొత్తగూడెంరూరల్: భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దర్శించుకునేందుకు వెళుతున్న డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌లకు జూలూరుపాడులో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. శ్రీసాయిబాబా ఆలయం వద్ద ముగ్గురు మంత్రుల రాకకోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎదురు చూశారు. అయితే ఇక్కడ ఆగకుండా అభివాదం చేసుకుంటూ వెళ్లడంతో నిరుత్సాహానికి గురయ్యారు. నిరాశతో వెనుతిరిగారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూధన్‌రావు, లేళ్ల గోపాల్‌రెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, అల్లాడి లింగారావు, వేల్పుల నరసింహారావు, బానోత్ నవీన్ రాథోడ్, నర్వనేని పుల్లారావు, పోతురాజు నాగరాజు, పణితి వెంకటేశ్వర్లు, ఎస్కే మైబూ, యల్లంకి పుల్లయ్య, కొదుమూరి కోటేశ్వరరావు, కంచర్ల హరీష్, బానోత్ లాలు నాయక్, పూర్ణకంటి నాగేశ్వరరావు, బానోత్ శాంతిలాల్, బానోత్ ధర్మా పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా కొత్తగూడెం వచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు.

పట్టణ శివారులోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పార్టీ అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య ఆధ్వర్యంలో మంత్రులకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. జేబీ శౌరి, మోత్కూరి ధర్మారావు, ఎండీ గౌస్ మొయినుద్దీన్, గడ్డం రాజశేఖర్, అజ్మీరా సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వానికి అభినందనలు



మాట్లాడుతున్న మధు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ తరుపున అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని కార్మికులు స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలకమైన పాత్ర పోషించారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు అన్నారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ప్రభుత్వంపై కార్మికులు, ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కే.బ్రహ్మాచారి, ఏజే రమేష్, నబీ, సత్య రేణుక, నర్సింహారావు, పాయం రాధాకుమారి, నిమ్మల మధు, సుల్తానా, రేష్మ, కృష్ణ, సుశీల, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు సన్మానం



ఎమ్మెల్యే కోరంకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ, సీఐలు, ఎస్ఐ



కనకయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న మూన్నూరుకాపు సంఘం నాయకులు

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం అనంతరం ఇంటికి వచ్చిన కోరం కనకయ్యను ఆయన స్వగృహం కోయగూడెంలో పలువురు అధికారులు, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఆదివారం కలిశారు.

డీఎస్పీ రమణమూర్తి, ఇల్లెందు సీఐ కరుణాకర్, టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, టేకులపల్లి ఎస్ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి కోరంను సన్మానించారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గుగులోత్ రాంచందర్, ఎజ్జు భాస్కర్, గుగులోత్ శ్రీను, అయిత శ్రీరాములు తదితరులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. టేకులపల్లి మున్నూరు కాపు సంఘం నాయకులు గంగారపు మల్లయ్య, సంపటి వెంకన్న, రామిశెట్టి వీరయ్య, గంగారపు కోటేశ్వరరావు, లింగాల ఉత్తరయ్య, జాబిశెట్టి పిచ్చయ్య తదితరులు ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేత జానీ, మైనారిటీ నాయకులు కనకయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వనసమారాధన



మాట్లాడుతున్న విజయభాస్కర్

జూలూరుపాడు: కాకర్ల శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలోని మామిడి తోటలో ఆదివారం ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన మహోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వనభోజనాలు చేశారు. సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



కుర్చీలాట పోటీలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో విశ్వబ్రాహ్మణ సంఘం వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. కార్తీకమాసం సందర్భంగా శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదురుగా ఉన్న మామిడితోటలో వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నరేంద్రప్రసాద్



సుజాతనగర్: మండల మున్నూరుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పెద్దమళ్ల నరేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. మున్నూరు కాపుల వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొడ్డు కేశవరావు, కార్యదర్శిగా చింతలపూడి సాయి, కోశాధికారిగా బొడ్డు బుజ్జి, సహాయ కార్యదర్శిగా గడ్డం లక్ష్మణరావు ఎన్నుకున్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

జూలూరుపాడు: మండల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని బీఎస్పీ జిల్లా జాయింట్ సెక్రటరీ తంబర్ల నరసింహారావు కోరారు. ఆదివారం జూలూరుపాడులో మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మండల ప్రజలకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాశ్వత మార్కెట్, బస్‌షెల్టర్, పబ్లిక్ టాయిలెట్స్, పలు గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించే విధంగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం హర్షణీయమన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



ఐఎన్‌టీయూసీలో చేరిన నాయకులు

ఇల్లెందు: గుర్తింపు సంఘంలో సభ్యులుగా ఉన్న పలువురు ఆ సంఘానికి రాజీనామా చేసి ఐఎన్‌టీయూసీలో చేరారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ నాయకులు లింగాల జగన్నాథం నేతృత్వంలో పలువురు టీబీజీకేఎస్ నేతలు కుమార్ సింగ్ (బోలా), ఢిల్లీ శ్రీనివాస్, జే.శ్రీనివాస్, టి.రమేష్‌సింగ్, కే.సుజన్, జి.ఆనంద్, జి.ప్రేమ్‌కుమార్, బి.చంద్రశేఖర్, కే.రాజలింగంలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సూర్యం, సాంబమూర్తి, హరినాథ్‌బాబు తదితరులు ఉన్నారు.

సింగరేణిలో ఏఐటీయూసీని గెలిపించండి



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: ఈ నెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించటం ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ స్పష్టం చేశారు. ఆదివారం జేకేఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. నిన్న మొన్నటి వరకు మీరంతా టీబీజీకేఎస్‌లో పని చేశారని, ఆ సంఘం కేవలం పైరవీలకే పరిమితం అయిందన్నారు. ఏనాడూ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ సంఘం విధానాల వల్ల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని విమర్శించారు. ఫలితంగా సింగరేణి భవిష్యత్ అంధకారంగా మారిందని చెప్పారు. కార్మికులు కష్టపడి సంపాదించిన సొమ్మును సింగరేణి సంస్థకు సంబంధం లేని జిల్లాలకు ఖర్చు పెట్టి ఇప్పుడు కార్మికులు జీతాలు ఇవ్వడానికి బ్యాంకుల నుంచి అప్పుల తేవాల్సిన దౌర్భాగ్యం వచ్చిందన్నారు. సర్కార్ సంఘం గుర్తింపు సంఘంగా ఉండి ఇలాంటి పరిస్థితి మళ్లీ వస్తే సంస్థ దివాలా తీస్తుందన్నారు. ఐఎన్‌టీయూసీ కూడా అదే బాటలో నడిచిందన్నారు. ఈ విషయాలు గమనించి కార్మికులు నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గడదాసు నాగేశ్వరరావు, దాసరి రాజారామ్, కె.సుందర్, గాలీబ్ సాహెబ్, గుగులోతు కృష్ణ సంజీవచారి, హుస్సేన్, శ్రీనివాస్, తిరుమలరావు, నారాయణ, జగదీష్, సత్య నారాయణ, వలీ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేస్తాం..




మాట్లాడుతున్న ఆకునూరి కనకరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఏడోసారి జరగనున్న కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేస్తామని నాయకులు ఆకునూరి కనకరాజు అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు పట్టం కట్టినట్లే, ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ తుడిచి పెట్టుకపోయి ఐఎన్‌టీయూసీ ఘన విజయం సాధిస్తుందన్నారు. సింగరేణిలోని వివిధ యూనియన్ల నుంచి చాలామంది ఐఎన్‌టీయూసీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని, అలా అని అందరినీ చేర్చుకునే అవకాశం లేదని, ఒక యూనియన్ నుంచి ఐఎన్‌టీయూసీలోకి రావాలంటే వారి క్యారెక్టర్‌ను పరిగణలోకి తీసుకోవటమే కాకుండా యూనియన్ గెలిచినా.. ఓడినా.. యూనియన్‌లోనే మనుగడ సాగేవారు మాత్రమే యూనియన్‌కు అవసరమని, అటువంటి వారిని మాత్రమే తమ యూనియన్‌లో చేర్చుకుంటామన్నారు. పూటకో జెండా, రోజుకో యూనియన్ మారే వారిని చేర్చుకునే ప్రసక్తే లేదన్నారు. అంతే కాకుండా ప్రస్తుతం టీబీజీకేఎస్‌లో ఉన్న 80శాతం నాయకులు, కార్యకర్తలు గతంలో ఐఎన్‌టీయూసీలో పనిచేసిన వారేనని, పదవుల కోసం వెళ్లినవారు... ప్రస్తుతం తిరిగి ఐఎన్‌టీయూసీలో చేరేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు. అయితే ఈసారి పార్టీ, యూనియన్ నాయకులు ఒక కమిటీ వేయనున్నారని, ఆ కమిటీ తీర్మానం మేరకు మాత్రమే యూనియన్‌లో చేర్చుకుంటామని చెప్పారు.

నాయకులు కార్మికులకు, మేనేజ్‌మెంట్‌కు వారధిలా ఉండాలి కానీ, కార్మికుల సమస్యలను తమ ఏజెండాగా మార్చుకొని ధనార్జనే లక్ష్యంగా పైరవీలు, చేసి కార్మికుల రక్తాన్ని తాగే నాయకులను రానివ్వమని, కాబట్టి వారికి వారే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వల్లోజి రమేష్

జూలూరుపాడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుపాన్ కారణంగా మండల వ్యాప్తంగా దెబ్బతిన్న వరి, పత్తి, మిరప, మొక్కజొన్న పంటలను ఎన్డీ పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తుపాన్‌తో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతులకు నష్టవాటిల్లిందన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షం రైతులను కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. మిరప పంట ఎకరానికి రూ.50 వేలు, పత్తికి రూ.25 వేలు, వరికి రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు తెల్లం నరసింహారావు, కూరాకుల నరసింహారావు, తెల్లం వెంకటేశ్వర్లు, మడి సీతారాములు, కృష్ణయ్య, బచ్చల నాగేశ్వరరావు, బొర్రా నరేష్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మటికి చాదర్ ఊరేగింపు



చాదర్ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఇల్లెందురూరల్: హజరత్ నాగుల్‌మీరా దర్గాహ్ మౌలా చాన్ చిల్లా ఉర్సు ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. సత్యనారాయనపురం గ్రామం నుంచి దర్గాహ్ వరకు భక్తులు భారీ జులూస్ నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఇంటి నుంచి మటికి చాదర్ (వెండి బిందెలో బెల్లం పానకం)ను భక్తిశ్రద్ధలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు భక్తులు నీళ్లు ఆరబోసి, ధన, ధాన్యాలను అందజేశారు. ఊరేగింపు కొనసాగుతుండగా పలువురు భక్తులను నాగుల్‌మీరా ఆవహించడంతో సందడి చేశారు. మటికి చాదర్‌ను హజరత్ నాగుల్‌మీరాకు నైవేద్యంగా అందజేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థితో కేక్ కట్ చేయిస్తున్న రమేష్

జూలూరుపాడు: స్థానిక సాయి ఎక్స్‌లెంట్ టాలెంట్ స్కూల్ 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్అండ్‌బీ సీనియర్ అసిస్టెంట్, సాయి ఎక్స్‌లెంట్ స్కూల్ వ్యవస్థాపకులు జి.రమేష్, చొప్పకట్ల చంద్రశేఖర్ శర్మ హాజరయ్యారు. మాట్లాడుతూ... సాయి ఎక్స్‌లెంట్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. ఆరేళ్లుగా నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షల్లో సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌లో కోచింగ్ తీసుకున్న విద్యార్థులే అత్యధిక సీట్లు సాధిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ ఆరబోయిన కృష్ణప్రసాద్, సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ వి.పూర్ణచందర్ రావు, ప్రిన్సిపాల్ శారద దేవి, హుస్సేన్ దంపతులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.